సేవాలయాలు!

- ప్రజల సేవలో సచివాలయాలు
- చెంతకే ప్రభుత్వ పథకాలు
- తప్పిన వ్యయ ప్రయాసలు
- వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు నాలుగేళ్లు పూర్తి

నాడు.. నాలుగేళ్ల క్రితం ఏ చిన్న ప్రభుత్వ సేవ పొందాలన్నా నెలల తరబడి ఎదురు చూడాలి. సుదూరంలోని ప్రభుత్వ కార్యాలయాలకు చెప్పులరిగేలా తిరగాలి. దళారుల ద్వారా అధికారులకు మాముళ్లు సమర్పించుకోవాలి. అయినా, పని సకాలంలో కాదు.
నేడు.. సేవ ఏదైనా ఎదురుచూడాల్సిన పనిలేదు. ప్రభుత్వ కార్యాలయాల వెంట తిరగాల్సిన అవసరం లేదు. దళారులను ఆశ్రయించాల్సిన పనిలేదు. లంచాలు ఇచ్చుకోవాల్సిన అవసరం అంతకన్నా లేదు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటే మనకు అవసరమైన అన్ని రకాల సేవలు పొందవచ్చు.


గణేష్ నగర్ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

కర్నూలు (టౌన్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాల ఏర్పాటుతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారు. అధికారంలోకి రాగానే ఆయన ఏర్పాటు చేసిన ఈవ్యవస్థ ద్వారా ఇదివరకులాగా మండలకేంద్రాలు, పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చెంతనే అవసరమైన సేవలు పొందుతున్నారు. 119 చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించిన కర్నూలు నగరంలో వంద శాతం ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే అది సచివాలయ వ్యవస్థ గొప్పతనమేనని చెప్పాలి. కర్నూలు నగరంలోని వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఈ నాలుగేళ్లలో కోట్లరూపాయల లబ్ధి పొందారు. మధ్య దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అందుతున్న ఈ లబ్ధి పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు మొదలుకొని పింఛన్ వరకు ప్రతి సేవను చెంతకు వచ్చి అందిస్తున్నారు. ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే సచివాలయాల సిబ్బంది ఇంటికి వచ్చి పెన్షన్ సొమ్ము అందజేస్తున్నారు. ఎవరైనా లబ్ధిదారుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉంటే అక్కడికి వెళ్లి పెన్షన్ అందిస్తున్నారు.

52 వార్డులు ఉన్నాయి 133 సచివాలయాలు
మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని 2019 అక్టోబర్ 2 వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. కర్నూలు నగరంలో జనాభా 5.50 లక్షలకు పైగా ఉంది. కర్నూలుతో పాటు పాణ్యం అర్బన్, కోడుమూరు అర్బన్ వార్డులు కలుపుకొని మొత్తం 52 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 133 సచివాలయాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 1.10 లక్షల ఇళ్ల యజమానులు వారికి అవసరమైన సేవలు పొందుతున్నారు. పట్టణ సచివాలయాల్లో 1 బీ, అడంగల్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ప్రింట్, టైటిల్ డీడీ, రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు సర్టిఫికెట్ కాపీ, విద్యుత్ కనెక్షన్ కేటగిరి మార్పు, ఇంటి స్థలం, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డు, అన్ని రకాల పెన్షన్లు, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, కాపు నేస్తం, వైఎస్ఆర్ బీమా, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న తోడు, వాహన మిత్ర ప్రయోజనం ఇలాంటి 536 రకాల సేవలు ఒకేచోట అందుతున్నాయి. ఇవన్నీ నిర్ణీత వ్యవధిలో 15 నిమిషాల నుంచి 72 గంటల వ్యవధిలో మేసేజ్‌తో కూడిన సమాచారంతో మంజూరు చేస్తున్నారు.



నగరంలోని మద్దూరు నగర్, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీల్లో ఏర్పాటు చేసిన సచివాలయాలు

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం సచివాలయాలు	-133
నాలుగేళ్లలో వివిధ పథకాల లబ్ధిదారులు	- 1.9 లక్షలు
పథకాల ద్వారా పొందిన లబ్ధి	- రూ.765.33 కోట్లు
అమ్మ ఒడి పథకం లబ్ధిదారులు	- 35, 935 మంది
నాలుగేళ్లలో పొందిన లబ్ధి	- రూ. 215. 61 కోట్లు
వసతి దీవెన పథకం అర్హులు	- 8,713 మంది
నాలుగేళ్లలో పొందిన లబ్ధి	- రూ. 69.70 కోట్లు
నగరంలో మొత్తం వైఎస్సార్ పెన్షన్‌దారులు	-32, 418
పొందిన లబ్ధి	- రూ. 438.02 కోట్లు

విద్యాదీవెనతో పిల్లలను చదివించుకుంటున్నా



మాపిల్లలు ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఉన్నత చదువులు చదవాలంటే మాలాంటి సామాన్య కుటుంబాలకు భారం. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా మాకు ఎంతో మేలు జరుగుతుంది. వలంటీర్ ఇంటికి వచ్చి మాకు ఈ పథకం గురించి చెప్పాడు. విద్యా దీవెనతో పాటు ప్రతి సంవత్సరం రూ. 20 వేలు స్కాలర్ షిప్ అందుతుంది. పైసా ఖర్చులేకుండా ఉన్నత విద్య అందిస్తున్న జగన్ సర్కారుకు మా కుటుంబం రుణపడి ఉంది.
– బి. శిరీషా, విఠల్‌నగర్

ఇంటి వద్దకే పెన్షన్



నాలుగేళ్ల క్రితం పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎవరూ పట్టించుకోలేదు. అక్కడికి పో.. ఇక్కడికి పో అని తిప్పి పెన్షన్ మంజూరు చేయలేదు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ఇంటికి వచ్చి వివరాలు తీసుకుని పింఛన్ మంజూరు చేశారు. ఇప్పుడు ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేకుండా నెలనెలా ఇంటి వద్దకే వచ్చి సచివాలయ ఉద్యోగులు పింఛన్ సొమ్ము ఇస్తున్నారు.
– సి. ఈరమ్మ, లబ్ధిదారురాలు

క్లుప్తంగా

పిల్లల పెంపకం ఒక కళ


ఐరిస్ ఫ్లోరిట్స్ కిడ్స్ పాఠశాలను ప్రారంభిస్తున్న యండమూరి వీరేంద్రనాథ్

కర్నూలు కల్చరల్: పిల్లల పెంపకం ఒక కళ అని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. కర్నూలు గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐరిస్ ఫ్లోరిట్స్ కిడ్స్ పాఠశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ పిల్లలు సరిగా చదవడం లేదని తల్లిదండ్రులు బాధ పడుతుంటారని చదువు కన్నా ముఖ్యం వారి నడవడిక అన్నారు. చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు ప్రేమ, సంస్కారం నేర్పించాలన్నారు. ప్లే స్కూల్స్‌లో విద్యార్థులకు మంచి పునాది పడుతుందన్నారు. పాఠశాల కర్‌స్పండెంట్ ఐ.ఎం. స్వామి, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం నాయకులు శ్రీనివాస రెడ్డి, వాసుదేవయ్య, యుగంధర్, ఉపాధ్యాయులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

జిల్లా కథా రచయితకు కుప్పం రెడ్డెమ్మ స్మారక పురస్కారం

కర్నూలు కల్చరల్: జిల్లా కథా రచయిత ఎస్‌డీవీ అజీజ్ కుప్పం రెడ్డెమ్మ స్మారక పురస్కారం అందుకున్నారు. కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం చిత్తూరు పట్టణంలోని సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రామలక్ష్మి, సభ్యులు డాక్టర్ నిరంజన్‌రెడ్డి, ప్రముఖ సాహితీ వేత్త శాంతి నారాయణ అజీజ్‌కు పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం అజీజ్ రచించిన అల్లూరి సత్యనారాయణరాజు పుస్తకావిష్కరణ జరిగింది. పురస్కార గ్రహీతకు పలు సాహితీ సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు శుభాకాంక్షలు తెలిపారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): తూకాల్లో, వస్తువుల విక్రయంలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలత శాఖ డిప్యూటీ కంట్రోలర్ చల్లా దయాకర్ రెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. సోమవారం పెద్దకడుబూరు మండలం కల్లుకుంట, ఆదోని రైల్వే స్టేషన్ ఆవరణలోని కూల్ డ్రింక్స్, బేకరి, కిరాణ షాపుల్లో ఆ శాఖ అధికారులు తనిఖీ చేసినట్లు వెల్లడించారు. కల్లుకుంట కూల్‌డ్రింక్ దుకాణం, ఆదోని రైల్వే స్టేషన్ సమీపంలోని మరో రెండు దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే అధికానికి వస్తువులు అమ్ముతుండడంతో కేసులు నమోదు చేసి మొత్తం రూ. 2 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఎవరైనా వస్తువులను అధిక రేట్లకు అమ్మినా, తుకాల్లో మోసాలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

కర్నూలు: రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. కర్నూలు నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సోమవారం మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాజ్‌విహార్, సీక్యాంపు సెంటర్, ఓల్డ్‌ఈద్గా, చెన్నమ్మ సర్కిల్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, ఉల్లంఘనలకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 27 మంది మైనర్ల నుంచి వాహనాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసి, రూ.54,945 జరిమానా విధించారు. సాయంత్రం కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్ దగ్గర మైనర్లతో పాటు, వారి తల్లి దండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఐదు మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. కర్నూలు రూరల్ మండలంలో 30.8 మి.మీ, కర్నూలు అర్బన్‌లో 22, మంత్రాలయంలో 9.6, తుగ్గలిలో 7.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా 28.3 మి.మీ వర్షం కురిసింది.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన


హబీబుల్లాను సన్మానిస్తున్న కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డి

కర్నూలు సిటీ: ఇటీవలే ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా లెవెల్‌లో 189వ ర్యాంకు సాధించిన హబీబుల్లాను సోమవారం వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి స్కూల్ అధినేత కేశవరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్కూల్ పూర్వ విద్యార్థి సివిల్స్‌లో ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

అవీ-ఇవీ

డోర్ డెలివరీ పక్కాగా చేయాలి
కర్నూలు(రాజ్‌విహార్): ప్రజలు బుకింగ్ చేసుకున్న పార్సిల్స్, కొరియర్ల డోర్ డెలివరీ పక్కాగా ఉండాలని కర్నూలు–2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ సూచించారు.సోమవారం ఆయన కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్గో పార్సిల్స్, కొరియర్ల రవాణా వ్యవస్థను సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందన్నారు.గతఏడాది నుంచి డోర్ డెలివరీ చేస్తూ సేవలు విస్తృతం చేసిందన్నారు. ఈ సేవల అందజేతలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సూచించారు.

చిరువ్యాపారుల బంకులు తొలగించొద్దు
కర్నూలు(సెంట్రల్): నగరంలోని బిర్లాగేటు నుంచి శంకరాస్ డిగ్రీ కళాశాల వరకు ఉన్న రోడ్డు సైడు దుకాణాలను తొలగించరాదని సీపీఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో రోడ్డు సైడు వ్యాపారులకు అండగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందనలో చిరు వ్యాపారుల షాపులు తొలగించరాదని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.రాధాకృష్ణ, సీహెచ్ సాయిబాబా, మహ్మద్‌రఫీ, కె.సుధాకరప్ప, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

బదిలీల నుంచి మినహాయింపునివ్వాలి
కర్నూలు(హాస్పిటల్): సాధారణ బదిలీల నుంచి డ్రైవర్లకు మినహాయింపునివ్వాలని విజయవాడలో ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డిని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, కర్నూలు, అనంతపురం జిల్లా అధ్యక్షులు వై. నాగేశ్వరరావు, రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు సోమవారం వారు వినతి పత్రం సమర్పించారు. పీహెచ్‌సీల్లో వాహనాలు లేనందున డ్రైవర్లకు బదిలీల నుంచి మినహాయింపునివ్వాలని కోరారు. ఈ మేరకు డీహెచ్ స్పందించి అన్ని జిల్లాల డ్రైవర్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఈ–శ్రామ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి
కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఈ –శ్రామ్ గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు సమీపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని కార్డులు పొందవచ్చని పేర్కొన్నారు.

తెలుగు కన్నడ కవితా గోష్టికి జిల్లా రచయిత
కర్నూలు కల్చరల్: శ్రీశ్రీ కళా వేదిక తెలుగు – కన్నడ కవితా గోష్టికి జిల్లా రచయిత, న్యాయవాది నరహరి నారాయణరెడ్డి ఎంపికయ్యారు. కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తి మండ ప్రతాప్ ఆహ్వాన పత్రం పంపారు. ఎంపికైన నారాయణరెడ్డికి న్యాయవాదులు, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

మరియమ్మకు కారుణ్య నియామకం
కర్నూలు(సెంట్రల్) : నగరంలోని 38వ వార్డు పరిధిలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తూ శంకరయ్య 2022 మార్చి 4వ తేదీన చెందాడు. ఈ నేపథ్యంలో ఆయన భార్య మరియమ్మ కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకోవడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. సోమవారం ఆమెకు కలెక్టరేట్ ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ ఏఓ వెంకటేశ్వర్లు సోమవారం నియామక ఉత్తర్వులు అందజేశారు.

సైన్స్‌పై అవగాహన అవసరం
కర్నూలు కల్చరల్: సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలను తొలగించాలంటే సైన్స్ గురించి తెలిసి ఉండాలని విజ్ఞాన వేదిక (జేవీవీ) జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణ కిశోర్ అన్నారు. సోమవారం కర్నూలు జిల్లా జేవీవీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ చదువుకున్న వారే సైన్స్‌ను ఉన్నది ఉన్నట్లు చూడకపోవడం బాధాకరమన్నారు. జేవీవీ జాతీయ నాయకులు మహమ్మద్ మియ్యా, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజూరు బాష, శంకరరావు, సుజాత పాల్గొన్నారు.

డీసెట్‌కు 286 మంది హాజరు
కర్నూలు సిటీ: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌కి సంబంధించిన డీసెట్ ప్రవేశ పరీక్ష సోమవారం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని సనత్‌నగర్‌లోని ఆయాన్ డిజిటల్ జోన్ ఐడీజెడ్‌లో నిర్వహించిన పరీక్షకు 357 మందికిగాను 286 మంది హాజరయ్యారు.

ఆక్రమణల తొలగింపు
కర్నూలు (టౌన్): రహదారుల విస్తరణలో భాగంగా బిర్లా సర్కిల్ ప్రాంతంలో వెలసిన బంకులను సోమవారం నగరపాలక టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. పోస్టాఫీస్ లైన్‌తో పాటు సంక్షేమ భవన్ ఇరు వైపులా దుకాణాదారులకు రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేసి విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. సోమవారం ఆయా దుకాణాలను తొలగించడంతో వ్యాపారులు కొంత సేపు వాగ్వాదానికి దిగారు.

బీజేపీ ఎంపీని సస్పెండ్ చేయాలి
కర్నూలు (రూరల్): రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను సస్పెండ్ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు పి. శ్రావణి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఆంధ్ర ప్రదేశ్ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో అమ్మ హాస్పిటల్ నుంచి నంద్యాల చెక్ పోస్ట్ వరకు మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం నంద్యాల చెక్ పోస్ట్ సర్కిల్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి లలితమ్మ, గౌరవాధ్యక్షురాలు ప్రమీలమ్మ, పావని పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ దొంగ అరెస్ట్
కర్నూలు : కర్నూలు దేవనగర్ బిర్లా క్వార్టర్స్‌లోని బంధువుల ఇంట్లో చోరీకి పాల్పడిన మహిళ దొంగను మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపారు. పాత బస్తీలోని పెద్దపడఖానకు చెందిన భారతికి సంబంధించిన 2 తులాల బంగారు నెక్లెస్‌ను చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి చోరీకి పాల్పడిన బీక్యాంపునకు చెందిన జ్యోతిని అరెస్ట్ చేసి నెక్లెస్ రికవరీ చేసినట్లు 3వ పట్టణ పోలీసులు తెలిపారు.

షరాఫ్ బజార్‌లో చోరీ
బంగారు నగలు రిపేరు కోసం వెళ్లిన ఓ మహిళ బ్యాగ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు పర్సు తస్కరించారు. కల్లూరు మండలం అయ్యప్పనగర్‌లో నివాసం ఉంటున్న పుగ్గాల శిరీషా ఈ నెల 9వ తేదీన తన దగ్గర ఉన్న నగల్ రిపేర్ల కోసం షరాఫ్ బజార్‌కి వెళ్లింది. దుకాణం యాజమానితో మాట్లాడుతుండగా, 13 గ్రాములు బంగారు నగలు, రూ.14 వేల నగదు, 7 గ్రాముల వెండి బ్రాస్‌లైట్ భద్రపరిని పర్సును దొంగలు తస్కరించినట్లు 2వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు
కర్నూలు కల్చరల్: జొహరాపురానికి చెందిన రాజేష్ పై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జొహరాపురంలో నివాసం ఉండే నాగేశ్వరి, సతీష్‌కుమార్ దంపతులపై తమ దూరపు బంధువు రాజేష్ పాత కక్షలను మనసులో పెట్టుకుని గత నెల 21వ తేదీ రాత్రి ఇంటిపైకి వచ్చి ఇంట్లో జొరబడి దాడి చేశారని, గర్భిణీని కూడా చూడకుండా తనను, తన భర్తను కొట్టి భయపెట్టాడని నాగేశ్వరి ఫిర్యాదు చేశారు. రాజేష్‌కు భయపడి ఇన్నాళ్లు ఫిర్యాదు చేయలేదని సోమవారం వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బ్యాంక్ క్లర్క్ మృతి
కర్నూలు కల్చరల్: జొహరాపురానికి చెందిన రాజేష్ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీస్‌లు, అతని భార్య భారతి వివరాల మేరకు.. మృతుడు కర్ణాటకలోని హోసూర్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడాలో క్లర్క్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కొద్ది రోజులుగా మూడీగా ఉన్న అతను గత నెల 15వ తేదీ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, ఈనెల 11వ తేదీ రాత్రి కోలుకోలేక మృతి చెందాడు. ఇతనికి ఇద్దరు పిల్లల సంతానం. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించాలి

కర్నూలు (రూరల్): నెల్లూర్ జిల్లాలో ఈ నెల 24 నుంచి 25 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించాలని పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి వేణు గోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలుర సబ్ జూనియర్ విభాగంలో కర్నూలుకు చెందిన క్రీడాకారులు బి.మహేష్ (54 కేజీలు),విజయ్ కుమార్ (74 కేజీలు), యస్. రోజా (83 కేజీలు), రోహిత్ (93 కేజీలు), బాలుర జూనియర్ విభాగంలో మహేష్ రావు (83 కేజీలు),శ్రీ లక్ష్మీనరసింహ (53 కేజీలు), ప్రవీణ్ కుమార్ (59 కేజీలు), మునిషాన్ (66 కేజీలు) ఎంపికైనట్లు తెలిపారు.

రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు(రూరల్) : మహారాష్ట్రలోని పూణేలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే జాతీయ స్థాయి జూనియర్ రగ్బీ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు బీ క్యాంప్ ఎస్టీ హాస్టల్‌కు చెందిన పవన్, ఆదర్శ విద్యా మందిర్ జూనియర్ కళాశాలకు చెందిన సింహాద్రి, నరసింహారెడ్డి, రవికుమార్ రెడ్డి ఎంపికైనట్లు రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు.

కిమ్స్‌లో అరుదైన ఆపరేషన్


ఆపరేషన్ అనంతరం కోలుకున్న శ్రీధర్‌కుమార్‌తో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కడపకు చెందిన రైల్వే ఉద్యోగి కేవీ శ్రీధర్‌కుమార్(43)కు 2020లో గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడ్డాయి. ఇందుకు అసలు కారణం గుర్తించకుండా వేర్వేరు ఆసుపత్రుల్లో ఆ రోగికి ఏకంగా ఐదు శస్త్రచికిత్సలు చేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం, చీముకారుతుండటంతో కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌కు రాగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ సూరా జానకిరామ్ సీటీస్కాన్ చేసి పాంక్రియాటైటిస్ అనే సమస్య ఉన్నట్లు గురించి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం అతను పూర్తిగా కోలుకున్నాడని డాక్టర్ సోమవారం తెలిపారు.

నిర్ణీత గడువులోగా వినతులకు పరిష్కారం

- అధికారులకు జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశం
- స్పందనలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్) : స్పందనలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీలకు నిర్ణీత గడువులోగా నాణ్యత ప్రమాణాలు పాటించి పరిష్కారాలు చూపాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్పందనలో వచ్చిన అర్జీలను అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చే సమస్యలకు సరైన ఎండార్స్‌మెంట్ ఇచ్చినప్పుడే రీ ఓపెన్ శాతాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ

స్పందనలో వచ్చిన కొన్ని వినతులు...
– తన భర్త లేట్ వెంకటేష్ నాయక్‌కు హుసేనాపురం పొలిమేరలోని సర్వే నంబర్ 70/2లో 1.50 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చిందని, ప్రస్తుతం ఆయన మరణించడంతో ఆ భూమిని తన పేరిట ఆన్‌లైన్ చేయాలని ఓర్వకల్లు మండలం కాల్వకు చెందిన సుగాలి సాలమ్మ జేసీకి వినతిపత్రం ఇచ్చారు.
– తన తల్లికి నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో గృహం మంజూరైనదని, అయితే ఆమె ఇటీవల మరణించడంతో ఆ ఇంటిని తన పేరిట మంజూరు చేయాలని ఆలూరు మండలం నివాసి రాము అధికారులకు విన్నవించారు.
- కర్నూలు జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జి.రామకృష్ణ జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం అందించారు.
- కల్లూరు వక్కెరవాగు పాత బ్రిడ్జి స్థానంలో ఎత్తు పెంచి కొత్త బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం నాయకులు కె.సుధాకరప్ప ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు.

పోలీసు స్పందనకు 81 ఫిర్యాదులు
కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 81 ఫిర్యాదులు స్పందనకు వచ్చాయి. వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

కర్నూలు (టౌన్): తమ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు సరిగా లేవని కొందరు, తాగునీటి సమస్య నెలకొందని మరికొందరు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి వినతులు అందజేశారు. సోమవారం కమిషనర్ నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, మున్సిపల్ ఎస్ఈ వేణు గోపాల్, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

పెద్దాసుపత్రిలో దొంగతనాలు జరగకుండా నిఘా పటిష్టం

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో దొంగతనాలు జరగకుండా నిఘా మరింత పటిష్టంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. సాక్షిలో ప్రచురితమైన 'పెద్దాసుపత్రిలో దొంగలు బాబోయ్' కథనానికి ఆయన స్పందించి సోమవారం ఆసుపత్రిలోని సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆసుపత్రిలోని రద్దీ ప్రాంతాలు, ముఖ్యమైన కూడళ్లలో నిఘా పటిష్టం చేయాలన్నారు. ఇకపై ఆసుపత్రిలో ఎక్కడా చోరీలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సెక్యూరిటీ గార్డులపై ఉందని, ఈ విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని హెచ్చరించారు. ఇకపై చోరీలు జరిగితే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఆసుపత్రిలో నిఘాను పెంచేందుకు త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు డీఎంఈకి కూడా నివేదించామని, అక్కడి నుంచి ఆదేశాలు రాగానే వాటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

టీడీపీ ప్రభుత్వంలోనే అన్యాయం

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలో కొన్ని ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు అన్యాయం చేసింది గత తెలుగుదేశం ప్రభుత్వమేనని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం(ఏపీ హంస) కర్నూలు జేఏసీ చైర్మన్ మద్దూరి వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ రోజు ఓ పచ్చపత్రికలో 'ఆశ చూపి అన్యాయం–కాంట్రాక్టు ఉద్యోగులతో సర్కారు ఆటలు' అనే కథనాన్ని కాంట్రాక్టు ఉద్యోగులు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఉంచి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక కమిటీలతో కాలయాపన చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్రమబద్ధీకరణ చేసిందన్నారు. ఇది చెల్లబాటు కాదని ఎల్లో మీడియా చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

సచివాలయాలతో మెరుగైన సేవలు

- గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన వివిధ రకాల సేవలతో పాటు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక 13వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బంగారుపేట వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

సంక్షేమ సారథి సీఎం జగనన్న

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 33వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ పార్టీలకు, వర్గాలకు, మతాలకు, కులాలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 33వ వార్డు పాత కల్లూరులో స్థానిక కార్పొరేటర్ నరసింహులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో పర్యటిస్తూ వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల వల్ల వారు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. కాలనీలో ఎవైన సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను తెలియజేయగా సకాలంలో పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి, జయరాముడు, నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతురెడ్డి, కె.పుల్లారెడ్డి, రంగప్ప, జగదీష్, భాస్కర్, సుబ్బారెడ్డి, శివ, ఇస్మాయిల్, వీరేందర్, ఈశ్వరయ్య, వానప్ప పాల్గొన్నారు.


వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి